సత్యవాడ పిహెచ్‌సిలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సత్యవాడ పిహెచ్‌సిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, వేలివెన్ను పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్‌కె.ఇర్ఫాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సత్యవాడ ఉన్నత పాఠశాలలో 19 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌బి పరీక్షలు, గర్భిణులకు రక్తహీనత రాకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల పై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం రికార్డులు పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ డిపిఎంఒ అభిషేక్ రెడ్డి, డిపిఒ సంధ్యారాణి, డిపిహెచ్ఎన్ఒ వసంతలక్ష్మి, ఎంపిహెచ్ఇఒ ఖాన్ పాల్గొన్నారు.

అమ్మకానికి పొగాకు సిద్ధం

14 నుంచి కొనుగోళ్లు ప్రారంభం
గతేడాది కేజీ రూ.248.41 పలికిన ధర
8వేల ఎకరాల్లో అదనంగా సాగు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పొగాకు కొనుగోలుకు బోర్డు ముహూర్తం ఖరారు చేసింది. మార్చి 14వ తేదీ నుంచి పొగాకు బోర్డులో వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలోని గోపాలపురం, దేవరపల్లి, రాజమహేంద్రవరం రూరల్‌తో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని 4 మండలాల్లో 66,500 ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతోంది. బోర్డు పరిధిలో 14,600 బ్యారెన్ల పరిధిలో 57,500 ఎకరాల సాగుకు మాత్రమే అనుమతి ఉంది. అధికారుల గణాంకాల ప్రకారం 8,750 ఎకరాలకు అదనంగా సాగు జరిగింది. ప్రతి ఏటా కేజీ సగటున రూ.180 నుంచి రూ.200 మించిన దాఖలాలు లేవు. గతేడాది అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడటంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. ఒక దశలో కేజీ రూ.280 కూడా పలికింది. సగటున రూ.248.41చొప్పున కొనుగోలు జరిగాయి. జిల్లాలో టుబాకో బోర్డు ఏర్పాటు చేసిన తర్వాత ఈ ధర అత్యధికమని అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏర్పడిన డిమాండ్ నేపథ్యంలో ఈ ఏడాది అత్యధిక మంది వర్జీనియా పొగాకు సాగు చేశారు. ఐటీసీ వంటి సంస్థలతో చర్చలు జరిపి అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లకు మూడు దశల్లో తేదీ ఖరారు చేశారు. మొదటి, రెండో దశల్లో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ కాగా మూడో దశలో మార్చి 14 నుంచి జిల్లాలో కొనుగోలు ప్రారంభం కానున్నాయి.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలో ఒక్కొక్కటి, జంగారెడ్డిగూడెంలో రెండు మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభ రోజుల్లోనే మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్జీనియా పొగాకు పంట దారుణంగా దెబ్బతింది. పంటను దున్నేసి మరలా మొదటి నుంచి నాట్లు వేశారు. పెట్టుబడులతో పాటు అధిక ధరలకు నారు కొని సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది. గతేడాది పొగాకు చరిత్రలోనే ఎన్నడూ లేని ధరలతో రికార్డులు సృష్టించాయి. వేలం ప్రక్రియ ప్రారంభం రోజు నుంచే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. రికార్డు స్థాయిలో కేజీ పొగాకు గరిష్ఠంగా రూ.288 నమోదై రాష్ట్రంలోనే ఆల్టైం రికార్డును నమోదు చేసుకుంది. పదేళ్ల క్రితం కేజీ పొగాకు రూ.200 మైలు రాయిని దాటింది. ఆ తరువాత 2019లో కేజీ ధర రూ.230 నమోదవ్వగా 2020లో కేజీ పొగాకు రూ.245 ధర పలకడంతో రికార్డుకెక్కింది. తరువాత గతేడాది రూ.288తో మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది కూడా ఆశాజనకంగా ధరలు రావాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పొగాకును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఆశాజనకంగా సాగు...

గతేడాది పొగాకు పంటకు మంచి గిరాకీ ఉండటంతో లాభసాటి ధర దక్కింది. దీంతో ఈ ఏడాదీ పొగాకును సాగు చేశాను. పంట కూడా ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వచ్చింది. ఈ ఏడాదీ పొగాకు మంచి ధర దక్కుతుందని ఆశిస్తున్నాను. అప్పు చేసి పంట వేశాను. గతేడాది కంటే పెట్టుబడి కూడా పెరిగింది. కనీసం కేజీ పొగాకుకు రూ.240 ధర రాకపోతే నష్టపోయే ప్రమాదం ఉంది.

- వి.వీరయ్య, పొగాకురైతు.

నిరసన తెలుపుతున్న కార్మిక, రైతు సంఘాలు, వామపక్షాల నాయకులు

రైతు ఉద్యమంపై మోడీ ప్రభుత్వ దాడిని ఖండించండి

యువరైతు మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత
కేంద్ర కార్మిక సంఘాల నాయకుల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రైతు ఉద్యమంపై మోడీ ప్రభుత్వ దాడిని ఖండించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపు మేరకు నగరంలోని శ్యామల సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎపి రైతు సంఘం, ప్రజాసంఘాలు, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాటంపై మోదీ ప్రభుత్వం దమనకాండకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు, సిపిఐ ఎంఎల్ నగర కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ దాడిని ఖండించాలన్నారు. యువరైతు మృతికి మోడీ ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. 56 అంగుళాలు ఛాతి వున్నది రైతులపై యుద్ధం చేయడానికా అని ప్రశ్నించారు. రైతాంగాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేసే బిజెపిని ఓడించాలని కార్మిక సంఘాలు, వామపక్ష, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాడులుగా మారి 3 లక్షలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. దేశంలోని రైతుల వద్ద ఉన్న భూములను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగించేందుకు మూడు వ్యవసాయ చట్టాలకు సవరణ చేసి మోడీ తనకున్న కార్పొరేట్ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు పోరాడి 700 మంది రైతులు పైబడి ప్రాణ త్యాగాలు చేశారన్నారు. రైతులు ప్రాణ త్యాగాలు ఫలితంగానే ఆ చట్టాలకు చేసిన సవరణలు మోడీ రద్దు చేశారన్నారు. మొదటి దశ రైతు ఉద్యమం సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కారణంగా రెండో దఫా రైతు ఉద్యమం ప్రారంభమైందన్నారు. పంటలకు కనీసం మద్దతు ధర, విద్యుత్ చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలని, స్వామినాథన్ కమీషన్ రిపోర్టు అమలుచేయాలని, భారత వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి కాపాడాలని ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా రైతులు పోరాడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం రైతులపై శత్రుదేశంపై దాడి చేసినట్లుగా రైతులపై పెల్లెట్ గన్స్, పిరంగులు, తుపాకులు, బాష్పవావు ప్రయోగం, రోడ్లపై కంచెలు వేసి తీవ్ర నిర్బంధాలకు గురిచేస్తున్నారన్నారు. 90 శాతం వ్యవసాయ భూముల్లో కౌలు రైతులు అర్ధ బానిసలుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రకటించే రైతు పథకాలు ఏవీ కౌలు రైతులకు చేరట్లేదని విమర్శించారు. యువ రైతు మతిపై న్యాయ విచారణ జరిపించాలని, రైతులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎం.సుందరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, బి.పవన్, టిఎస్.ప్రకాష్, నాయకులు టి.సావిత్రి, పేరయ్యలింగం, అప్పల నర్సయ్య, ఆనంద్, ఎన్.రాజా, రాంబాబు, వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, ఎఐటియుసి నాయకులు సస్పా రమణ, నల్లా రామారావు, పడిడిఎస్‌యు జిల్లా కోశాధికారి కె.భానుప్రసాద్, జిల్లా నాయకులు ధర్నేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి దాడిలో రెండు మేకలు మృత్యువాత

ప్రజాశక్తి - గోపాలపురం

పెద్దపులి దాడిలో రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో మండలంలోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం మండలంలోని కరగపాడు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందని రాజమహేంద్రవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.ధనరాజు తెలిపారు. గురువారం సాయంత్రం పెద్దపులి తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామ సమీపంలో ఉందని అంచనా వేశామన్నారు. శుక్రవారం ఉదయానికి మలగమ్మ మెట్ట, సంగాయగూడెం గ్రామాల మీదుగా కరకపాడు అటవీ ప్రాంతానికి చేరిందని తెలిపారు. కరకపాడు పంచాయతీ బుచ్చియపాలెం గ్రామానికి చెందిన బొమ్మిన బాబూరావుకు చెందిన రెండు మేకలను పెద్దపులి చంపేసిందని తెలిపారు. వాటిని తినకుండా అక్కడే వదిలేసింది. వీటిని చూసిన రైతు అక్కడి నుంచి పారిపోయాడని తెలిపారు. ప్రస్తుతం పెద్ద పులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలో పాపికొండల అభయారణ్యంలోకి చేరే అవకాశం ఉందన్నారు. పెద్దపులి జాడ కనిపెట్టేందుకు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాయంత్రం 5 గంటలు దాటిన ఇంటి నుంచి బయటకు రాకూడదన్నారు. అటవీ ప్రాంతంలో పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. కుదిరితే పనులను వాయిదా వేసుకోవాలన్నారు. ఈ ఆపరేషన్‌లో పోలవరం రేంజ్ అధికారి దావీదురాజు, డిఆర్ఒ వేణుగోపాల్, ఎఫ్‌బిఒ కార్తీక్, శ్రీను, పోలవరం రేంజ్ సిబ్బంది, పాల్గొన్నారు.

మృతిచెందిన మేకను పరిశీలిస్తున్న అధికారులు

చెక్కు అందిస్తున్న తోట నరసింహం

జగన్ కోసం రెండుసార్లు బటన్ నొక్కి గెలిపించాలి: తోట

ప్రజాశక్తి -గోకవరం

ప్రజల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 124 సార్లు బటన్ నొక్కితే, ఆయన కోసం రెండు సార్లు బటన్ నొక్కి ఎంపీగా చలమలశెట్టి సునీల్, ఎంఎల్ఎగా తనను గెలిపించాలిన వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. శుక్రవారం గోకవరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా పథకం చెక్కుల పంపిణీలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గోకవరం మండలంలో ఆసరా పథకంలో భాగంగా 8,750 మంది లబ్ధిదారులకు రూ.13.42 కోట్లను అందించారన్నారు. 1465 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడతగా విడుదలైన చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. అనంతరం సిఎం చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట రాంజీ, ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగా, గోకవరం సొసైటీ అధ్యక్షులు దాసరి చినబాబు, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, సుంకర రమణ, ఎంపిడిఒ కె.వసంత, ఎం.రాజేశ్వరరావు, ఎపిఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆదివారం జరగబోయే గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం చేశామని ఎగ్జామ్ కు తూర్పుగోదావరి జిల్లా నందు 53 పరీక్ష కేంద్రాలలో 18, 501 మంది పరీక్షకు హాజరవుతున్నారని అధికారులు. పరీక్ష నిర్వహణకు 53 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 53 మంది మండల స్థాయి అధికారులను లైజన్ ఆఫీసర్లుగా, 18 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి పగడ్బందీగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకూ జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకిఉదయం 9:30 నుంచి 10:15 వరకు అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. 10.15 గంటల తరువాత లోనికి అనుమతి ఉండబోదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటుగా ఒక ఒరిజినల్ ఫోటో, ఐడి(పాస్ పోర్టు, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్)తో హాజరు కావాలని తెలిపారు. హాల్ టికెట్‌లో ఫోటో లేక పోయినా, ఫోటో సరిగా లేని అభ్యర్థులు గెజిటెడ్ అధికారి సంతకంతో 3 పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటోలతో హాజరు కావాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

తాళ్లపూడి : మండలంలో గుర్తించిన మూడు గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 25న గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయన్నారు. వేగేశ్వరపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాళ్లపూడిలోని శ్రీ పరస పద్మరాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో గల డిగ్రీ కళాశాలలో 720 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మొబైల్ భద్రపరుచుకునేందుకు గది, ప్రత్యేక హెల్ప్ డెస్క్, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర ఏర్పాట్లు అన్ని సక్రమంగా ఉండాలని ఆయా యాజమాన్యాలకు సూచించారు. ఐదు అడుగుల కంటే ఎక్కువ పొడుగు గల బెంచీలపై ఇద్దరు విద్యార్థులు కూర్చుని పరీక్షలు రాసేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఆయన వెంట గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్స్ ఉన్నారు.

తాళ్లపూడిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

సమావేశంలో పాల్గొన్న సిఐ, ఎస్ఐ తదితరులు

శాంతిభద్రతలకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి- కడియం

గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ కృష్ణసాయి కోరారు. కడియం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు ప్రతి చిన్న విషయానికి గొడవలకు పోరాదన్నారు. చిన్నచిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పోయి కేసుల్లో చిక్కుకోరాదన్నారు. ప్రతి గ్రామంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కడియం మండలంలో గతంలో నేరాలు అధికంగా నమోదు అయ్యాయని, ప్రస్తుతం నేరాల సంఖ్య బాగా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, నాయకులు లావేటి రమేష్, సర్కార్ భాషా, పలువురు పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్య, వైద్యంతోనే మెరుగైన సమాజం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

దేశ ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందితేనే దేశాభివృద్ధి సాధ్యమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్‌వేణుగోపాలకష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో గ్రామ సంఘాల సహాయకులు, ఆశా వర్కర్ల ఆత్మీయ సమావేశానికి మంత్రి వేణు గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా పని చేసినప్పుడు అందరికీ సమ న్యాయం జరుగుతుందన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆ సత్ఫలితాలు నేడు కనపడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీష్ మీడియం, ఆరోగ్యానికి సంబంధించి జగనన్న గోరుముద్ద, పాఠశాల ఆధునికీకరణ, జగనన్న విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో మెడికల్ కళాశాలలు 11 మాత్రమే ఉండేవని, నూతనంగా మరో 17 వైద్య బోధన కళాశాలలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మరోవైపు ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, జెసిఎస్ కన్వీనర్ తడాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ఆశాలు, గ్రామ సంఘాల సమాయకులు తదితరులు

కష్టపడి పని చేసేవారికి గుర్తింపు : తోట

ప్రజాశక్తి -గోకవరం

కష్టపడి పని చేసేవారందరికీ గుర్తింపు ఉంటుందని వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. శుక్రవారం గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలంటీర్లకు సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. వాలంటరీర్ల సేవలు ఎనలేనివన్నారు. రాబోయే రోజుల్లో వాలంటీర్లకు మరింత ఆర్థిక అభివృద్ధి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, వైసిపి మండల నాయకుల, కార్యకర్తలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు పాల్గొని మాట్లాడారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వాలంటీర్లను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రూరల్ నియోజకవర్గంలో 877 మంది వాలంటీర్లకు పురస్కారాలు అందించామన్నారు. రాష్ట్రంలోని లక్షలాదిమంది పెన్షన్ దారులకు 1వ తేదీన పింఛనును వాలంటీర్లు అందజేస్తున్నారన్నారు. కోవిడ్ వంటి సమయాల్లోనే ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ డి.సూరిబాబు, స్థానిక నాయకులు, అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కార్టూ'నిజం'

ఎన్నికల్లోపు... ఎప్పుడు ఏ పార్టీ కండువా అవసరం అవుతుందోని.. అన్నీ ఉతికారేసి బీరువాలో పెట్టానయ్యాగారూ..!!

పాల సేకరణ వేగవంతం : కలెక్టర్

జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

జిల్లాలో అమూల్ పాల సేకరణ కేంద్రాలు ద్వారా పాడి రైతుల నుంచి పాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం కొవ్వూరు మండలం నందమూరులో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాల సేకరణ కేంద్రాన్ని కలెక్టర్ మాధవీలత, సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవత్సవ్, లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లడుతూ ప్రజల ఆర్థిక సాధికారిత పెంచే క్రమంలో అమూల్ కేంద్రాల ద్వారా పాలసేకరణ చేపట్టామన్నారు. పాల సేకరణ కేంద్రాల ద్వారా దళారుల ప్రేమేయం లేకుండా తగిన ధర చెల్లిస్తామన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో 44 పాల సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, మరో 42 కేంద్రాలను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం సుమారు 5 వేల లీటర్ల పాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన 42 కేంద్రాల ద్వారా ఒకొక్క కేంద్రం నుంచి రోజుకు 160 లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా పెట్టామన్నారు. చిట్యాల పాల శీతలీకరణ కేంద్రంలో 5 వేల లీటర్ల పాలు శీతలీకరణ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కాపవరం బల్క్ మిల్క్ యూనిట్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో మార్చి ఒకటి నుంచి రెండు బల్క్ మిల్క్ యూనిట్స్ భూపాలపట్నం, జంబూపట్నం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వీటి పరిధిలోని 9 మండలాల్లో జగనన్న పాల వెల్లువ ద్వారా 91 కేంద్రాల ద్వారా పాల సేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జిటి.సత్యగోవింద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : జగనన్న పాల వెల్లువతో పాడి రైతులు అదనపు ఆదాయం పొందొచ్చని జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పాలంగి, కె.సావరం, సూర్యారావుపాలెం, సత్యవాడ, చిలకపాడు, దమ్మెన్ను గ్రామాల్లో పాలవెల్లువ కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రాల్లో ప్రయివేటు యాజమాన్యాల కన్నా రైతులకు అధిక ధర లభిస్తుందన్నారు. పది రోజులకు నేరుగా బ్యాంకు ఖాతాలకు చెల్లింపులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి తదితరులు పాల్గొన్నారు.

పెరవలి : మండలంలో 15 గ్రామాల్లో పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించారు. ఖండవల్లిలో కేంద్రాన్ని ఎంపిపి కె.సీతారాం ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి, పశు వైద్యాధికారిని ఎస్‌కె.సల్మా, కార్యదర్శి ఎ.లక్ష్మీనారాయణ, పాడి రైతులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : కలవలపల్లి గ్రామంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మట్టా వీరా స్వామి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నందమూరులో పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నేరాలు ఘోరాలు

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాల పాలెంలో సారాను విక్రయిస్తున్న వీరవెల్లి మునీశ్వరునిని అరెస్టు చేసి అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకన్నామని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సారా తయారు చేయడం లేదా విక్రయించడం లేదా రవాణా చేయడం నేరమన్నారు. అనుమతి లేని బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం ఎస్‌సి కాలనీ వద్ద శ్రీలక్ష్మీ మల్టీప్లెక్స్ థియేటర్ ఎదురుగా 16వ నెంబరు జాతీయ రహదారిపై లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కాలనీకి చెందిన గోగులమూడి అచ్చియమ్మ(60) స్థానిక శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ థియేటర్లో స్వీపర్‌గా పనిచేస్తుంది. చెత్త పారబోసేందుకు వెళ్లిన వెళ్తుండగా ఆమెను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి రాయుడు సునీత

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ రహదారులను మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. ఇంజరం పంచాయతీ పరిధిలోని పెదగోవలంక వెళ్లే రహదారి అభివృద్ధి పనులుక ఎంపిపి సునీత శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో ఈ రహదారిని నిర్మించను న్నామని, వీటితో పాటు గ్రామంలో మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, నాయకులు రాయుడు గంగాధర్, ఎంపిటిసి కోరుకొండ కిరణ్ కుమారి, ఉపసర్పంచ్ కోరుకొండ అప్పారావు, గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, ఎంపిటిసి మోర్త బీమాబాయి, కూరాటి వాసు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సుంకర పావని

సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలను టిడిపి మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. పోస్టర్లు, హోర్డింగ్స్, పలు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

సమస్యలపై ఆరోగ్య కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-కాకినాడ

జిఎన్ఎం శిక్షణ పొందుతున్న సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, స్టేట్ నర్సింగ్ డిడిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ సచివాలయం కార్యదర్శుల సంఘం నాయకులు నీరజ, నాగవరలక్ష్మి మాట్లాడారు. సుమారు 115 మంది జిఎన్ఎం శిక్షణ పొందిన వారు పరీక్షలు సక్రమంగా రాసినప్పటికీ ఫెయిల్ అయ్యామని చెప్పారు. సరైన రీతిలో రీవాల్యుయేషన్ జరిపించి శిక్షణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. పరీక్షలకు ముందు రెండు వారాలపాటు ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

'ప్రత్యర్థి ఎవరైనా విజయం నాదే'

ప్రజాశక్తి -సామర్లకోట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలుపు ఖాయమని దవులూరి దొరబాబు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో దొరబాబు శుక్రవారం మాట్లాడుతూ ఎంఎల్ఎ చినరాజప్ప ఆరోగ్యం సరిగా లేదని అదే పార్టీకి చెందిన నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన ప్రత్యర్థిగా ఎవరు నిలబడినా తాను గెలవడానికి సిద్ధంగా ఉన్నానని దవులూరి దొరబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మకానికి ప్రతీక అన్నారు. తొలుత స్థానికుడైన తనకు రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ పదవిని అందించారని తెలిపారు.

పలు భవనాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని శాటిలైట్ సిటీ గ్రామంలో రు.2.3 కోట్లతో నిర్మించిన భవనాలను మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ స్వరాజ్య పాలనే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం సాటిలైట్ సిటీ గ్రామంలో 4 సచివాలయాలు, నాలుగు రైతు భరోసా కేంద్రాలు, నాలుగు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటికే పరిపాలను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్ వల్లే సాధ్యమైందన్నారు. సాటిలైట్ సిటీలో రు.160 లక్షలతో నాలుగు గ్రామ సచివాలయాలు, రూ.21.80 లక్షలతో ఒక రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో ఒక వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన సముదాయాలను ప్రారంభించామన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని అందుకున్న నాడే నిజమైన ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధ పాలన అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, ఎఇ సంపత్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్‌బాబు, పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ, మాజీ ఎంపిపి రేలంగి వీరవెంకటసత్యనారాయణ, మాజీ సర్పంచి ఆర్.రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్ బొమ్ము తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేణు

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా...

రాజమహేంద్రవరం ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎంపీ మార్గానిబ భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని 22వ వార్డులో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తన సేవలు, చేసిన అభివృద్ధి నచ్చితే ఎంఎల్‌ఎగా గెలిపించాలని అభ్యర్థించారు. హైదరాబాదు ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా గోదావరి బండ్‌ను అభివృద్ధి చేస్తానని చెప్పారు. కోటిలింగాల ఘాట్ నుంచి పుష్కర్ ఘాట్ వరకూ ఘాట్లను ఏకం చేసి సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. వార్డులో డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అజ్జరపు వాసు, కొత్త బాలమురళీకృష్ణ, కొత్త విజయరాజ్యలక్ష్మి, కె.రామ్‌జగదీష్, చిరంజీవి, ఎం.సాగర్, సుధీర్, కె.భాస్కర్, వీర్రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

వార్డులో పర్యటిస్తున్న ఎంపీభరత్

మెరుగైన వేతనాల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి - దేవరపల్లి

మెరుగైన వేతనాల కోసం కలిసి పోరాడుదామని లారీ కార్మికులకు నాయకులు పిలుపునిచ్చారు. దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లో విస్తరించి ఉన్న క్వారీ పరిశ్రమల్లో లారీలపై డ్రైవర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్న కార్మికులకు మూడు సంవత్సరాలకోసారి నూతన వేతన ఒప్పందాలు జరుగుతాయి. గతంలో చేసుకున్న వేతన ఒప్పందం మార్చి 9తో ముగుతుండడంతో తిరిగి నూతన వేతన ఒప్పందం కోసం 13 డిమాండ్స్ తో యజమానుల సంఘం కార్యదర్శి గౌరీ బాబుకు కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం వినతి పత్రం అందించారు. నూతన వేతన ఒప్పందం కోసం జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, కార్మికుల న్యాయమైన కోర్కెలు అంగీకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు సిహెచ్.రమేష్, పి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఐఎన్‌టియుసి నాయకులు దుర్గారావు, నాగరాజు, బి.సూరిబాబు, పికెఎస్ నాయకులు ఎస్‌కె.మస్తాన్, ఏడుకొండలు, గంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు

ప్రజారోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -గోకవరం

ప్రజలందరి వైద్య ఆరోగ్య అవసరాలను తీర్చడమే జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్) లక్ష్యమని వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. శుక్రవారం రంపఎర్రంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష-ఫేజ్2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అందిస్తున్న అనేక సంక్షేమ అభివృద్ధి ఫలాలతో రాష్ట్రం పేదరికాన్ని అధిగమించిందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేసిందన్నారు. ప్రజలందరూ ఈ సురక్ష కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొట్ట సత్యనారాయణ, కాళ్ల బుజ్జి, వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరంలో...

ఉండ్రాజవరం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో ప్రజలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతుందని కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జె.సంధ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పాలంగి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ శిబిరాల ద్వారా గ్రామీణ ప్రజలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న ఏడు రకాల సేవలను పొందొచ్చన్నారు. ఖరీదైన పరీక్షలు సైతం ఈ శిబిరాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, బొక్కా శివకుమార్, దొడ్డా సూర్య నారాయణ, వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, డాక్టర్ ఉషాదేవి డిఆర్ఎంఎస్ పృథ్వీకృష్ణ, ఆర్థోపెడిక్ విద్యాధరరావు, సిహెచ్ఒ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డి హసన్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ

గోకవరంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న పాటిరాంబాబు

సీతానగరం : పురుషోత్తపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, న్యూరాలజీ, కంటి వైద్యానికి సంబంధించిన డాక్టర్లు ఆరోగ్య సురక్షలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి ముని దీప్తి, ఎంపీహెచ్ ఏఎఫ్ మంగ, అంగన్వాడీలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగి భూములు స్థానికులకే కేటాయించాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

చొల్లంగి భూములను స్థానిక దళితులకే కేటాయించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జక్కల ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. చొల్లంగి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 47/3 లోని 4.24 ఎకరాల సాల్టు భూముల్లో స్థానికులకే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం 24 రోజులకు చేరాయి. దీక్షలు చేస్తున్న వారికి దళిత సంఘాలు మద్దతుగా నిలుస్తాయని జక్కల ప్రసాద్ బాబు అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన భూముల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన ఉప్పలంక లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడం తగదన్నారు. కాకినాడ వాసులకు చొల్లంగిలో పట్టాలు ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. చొల్లంగిలో ఉన్న అర్హులైన స్థానిక దళితులకు చొల్లంగి భూములు కేటాయించాలని కోరారు. లేనియెడల తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, దేవానందం, మురళి, మోర్త భైరవమూర్తి, సుబ్రహ్మణ్యం, టిడిపి మండల అధ్యక్షుడు కట్ట త్రిమూర్తులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న స్థానికులు, నాయకులు

సామాజిక సేవ అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

పుట్టినరోజును పురస్కరించుకుని చేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కందుల దుర్గేష్, వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కడియపులంక శ్రీసత్యదేవానర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు కుమారుడు రాజశేఖర్ పుట్టినరోజు శుక్రవారం నర్సరీ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కందుల దుర్గేష్, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. మానవసేవే మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి పుల్లా కుటుంబీకులు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని అందించడం హర్షణీయమన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో 2వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే మరో 2 వందల మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కళ్ళజోళ్లను అందించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు ఉల్లి రేవంత్ (కార్డియాలజిస్ట్), ఉల్లి వీరమణి (ఇఎన్‌టి), పిండి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలో సీతమ్మ పేట, పల్లపు వీధి, నక్కా వారి పేట, మత్స్యకార కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి నాసిరకంగా నిర్మించిన కల్వర్టుపై దిమ్మలు కూలిపోవడంతో ఆ ప్రాంతాలకు వెళ్లే స్కూల్ ఆటోలు, స్కూల్ బస్సులు, ప్రయాణికుల వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల అవినీతికి అద్దంగా ఈ నాసిరకంగా వేసిన డ్రైనేజీ కల్వర్టు నిదర్శనంగా నిలుస్తుందని స్థానికులు గుప్పిస్తున్నారు. పెద్ద వాహనాలు, స్కూల్ బస్సులు, నిత్యం రద్దీగా వెళ్లే ఈ రహదారికి ఐరన్ మెస్‌తో కల్వర్టు నిర్మించాల్సి ఉన్నప్పటికీ అధికారులు మామూళ్లు తీసుకుని కాంట్రాక్టర్‌కు అనుకూలంగా పని చేసారని దీంతో ఈ సమస్య ఉత్పన్నం అవుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి దఢమైన కల్వర్టు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టుపై కూలిపోయిన సిమెంట్ దిమ్మలు

పలు భవనాలకు ఎంఎల్‌ఎ తలారి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని నందిగంపాడులో నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు, శ్మశానంలో విశ్రాంతి భవనాన్ని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుదప రాంబాబు, ఎంపిపి మట్టా వీరస్వామి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాద్రి, ఎ.దొరయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎన్నికలకు టిడిపి సంసిద్ధం : సుజయ్

ప్రజాశక్తి - సామర్లకోట

రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో సంసిద్ధంగా ఉందని టిడిపి కాకినాడ పార్లమెంట్ జోనల్ కో ఆర్డినేటర్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జిల్లాల స్థాయిలోనే కాక పార్లమెంటరీ స్థాయిలో కూడా అధ్యక్షులను నియమించినట్లు రంగారావు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేటలో తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి రాబోయే ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాకినాడ పార్లమెంటరీ స్థాయిలో ఒక కాకినాడ పార్లమెంటు స్థానంతో పాటు దాని పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ విజయదుందుభి మోగిస్తుందని తెలిపారు. పూర్తిస్థాయిలో పార్టీని పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయడానికి కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురంలో టిడిపి విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వార్డు వార్డున, గ్రామ గ్రామాన పార్టీ కార్యకర్తలను సమీకరించి పూర్తిస్థాయిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ యువజన అధికారి

యానాంలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-యానాం

యానాం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కోకో, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి పాల్గొన్నారు.

25న జిప్‌మర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-యానాం

నియోజకవర్గంలో రూ.48.85 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన జిప్మర్ ఆసుపత్రి కన్సల్టెన్సీ యూనిట్‌ను ప్రధాని మోడీ ఈ నెల 25న గుజరాత్ నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రూ.కోట్ల కేంద్ర నిధులతో నిర్మించిన జిప్మర్ యూనిట్ ప్రారంభం నేపథ్యంలో ఆర్ఎఒ మునిస్వామి, పుదుచ్చేరి జిప్మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ గోపాల్ గోయల్ ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా అన్నా క్యారేజ్ వేడుకలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ద్వారా ఏర్పరచిన అన్నా జనార్ధన్ క్యారేజ్ పేదలకు భోజన వితరణ కార్యక్రమం 650 రోజులు పూర్తయిన సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ముఖ్యఅతిథిగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. 650 రోజులను సూచిస్తూ ప్రత్యేక కేకు కట్ చేసి పంపిణీ చేశారు. కింజరాపు యర్రంనాయుడు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి సాయిరాం వర్మ ఆధ్వర్యంలో పేదలకు భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్బు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరిట నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహేతుకంగా ఉండాలే తప్ప వ్యక్తిగతంగా ఉండరాదన్నారు. రాజకీయ విమర్శలలో కుటుంబ సభ్యులను లాగడం బాధాకరమన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడపా జగదీష్, మండపాక నాగబాబు, కర్రి వీరబాబు పాల్గొన్నారు.

భోజనాలు పంపిణీ చేస్తున్న సాయిరామ్ వర్మ

సిఎంకు కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం : రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు నెల రోజులపాటు విధుల నుంచి ఒక గంట ముందు వెళ్లేందుకు వెలుసుబాటు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మార్చి నెల 11 నుంచి ఏప్రిల్ 10వరకూ ముస్లిం ఉద్యోగులు సాయంత్రం నాలుగున్నర గంటలకే తమ విధుల నుంచి వెళ్లవచ్చున్నారు. ఈ వెసులుబాటు పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం వర్తింపజేయడం హర్షణీయమన్నారు.

జనసేన తరుపున టిక్కెట్ మాలలకు కేటాయించాలి

కొవ్వూరు రూరల్ : రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో ఉన్న కొవ్వూరు, గోపాలపురం రిజర్వుడు నియోజకవర్గాల్లో ఒక సీటును జనసేన తరపున మాలలకు కేటాయించలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ కోరారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య గహాన్ని సందర్శించి కోటి రూపాయలు విరాళం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళిత వర్గాలపై దాడులు అత్యాచారాలు హత్యలు పెరిగి పోయాయాని వాటిని అరికట్టడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిపై దళిత ఎంఎల్ఎలు, మంత్రులు కనీసం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పవన్ కళ్యాణ్‌కి పడాలంటే మాలలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొవ్వూరు రూరల్ : కొవ్వూరు కోర్టులో మార్చి 9న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ప్రమాద బీమా కేసులపై ఆయా కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ప్రమాదా బీమా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కేసులను రాజీ చేయడానికి ప్రయత్నించాలన్నారు.

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

O.S. 68/2017

Between:

వాది: యేలేటి వీర వెంకట సత్తిబాబు

ప్రతివాదులు: గల్ల కోటేశ్వరరావు (died) వగైరా

D-4: ఆత్మూరి కాసులమ్మ
W/o. సాయిబాబు, 55 సం॥లు,
గృహిణి, రాజుగారి సందు, పెద్దాపురం.

ప్రకటన

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన ఆత్మూరి కాసులమ్మ, W/o. సాయిబాబు, రాజుగారి సందు, పెద్దాపురంనకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను గ్రామంలో లేనట్లుగా తిరిగి వచ్చుచున్నందున ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, **ది. 27-2-2024వ సం॥రం** తేదీని మీరు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల సదరు దావా నుండి మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి మీ మీద ఎక్స్‌పార్టీ డిక్రీ పొందగలరని తెలియజేయడమైనది.

కె.వి.రాయుడు
వాది తరపు అడ్వకేటు, పెద్దాపురం

IN THE HONOURABLE COURT OF THE M.A.C.T.-CUM-IVth ADDITIONAL DISTRICT JUDGE FOR SC AND ST COURT AT VIZIANAGARAM
M.O.P. 419/2023

Between:
Mallajyosula Padmaja ...Petitioner
And: **Routhu Gurumurty and Others**
...Respondents

To, **1 Respondent:**
Routhu Gurumurty S/o Laxmanareddy, aged about 44 years, driver of bus AP.02 TE 0174,r/o D.No. 186, Main road, Isukaptla, Pangidi village, Kovvuru mandal, West Godavari District.

Please take notice that the above named petitioner filed the above M.V.O.P 419/2022 against you and others for claiming compensation on account of injuries sustained by her in a motor vehicle accident and the matter coming for your appearance and stands posted to **29-02-2024,** on that day your personally or through your Advocate attend before the **Honorable Court at 10-30 A.M.,** failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.

V.SAMBA.MURTHY
ADVOCATE,
VIZIANAGARAM, CELL: 9177559153.

ప్రకటన

మహారాజశ్రీ తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

OS No. : 590 / 2023

మధ్య :

కొలుకులూరి కేధారి, తండ్రి : కోటేశ్వరరావు, హిందువు, వయస్సు 40 సం.లు, వ్యాపారం, డోర్ నం.12-40, వెంకటగిరి-2, పిడింగొయ్యి, రాజమహేంద్రవరం రూరల్, తూర్పు గోదావరి జిల్లా. ...వాది

మరియు

కాప సత్యనారాయణ తండ్రి : నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 40 సం.లు, C/o. త్రిబతి శ్యామ్ సుందర్, డోర్ నం.2-28 -116, శాంతి నగర్, 3వ వీధి, ఓల్డ్ లిటిల్ ప్యారడైజ్ స్కూలు వెనుక, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా. ... ప్రతివాది

పై దావా గ్రంథములో వాది, ప్రతివాదికి ఎన్నిమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను, ప్రతివాది ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున, శ్రీ కోర్టు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా ప్రతివాదికి తెలియచేయునది దివి.28-02-2024వ తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని.లకు ప్రతివాది వ్యక్తిగతంగా గాని, ప్లీడరు సమక్షంలో గాని హాజరు అయి ఏమైనా అభ్యంతరాలు ఉంటేగాని, వాదనలు గాని తెలుకోవలెను లేనిచో శ్రీ కోర్టువారు, ప్రతివాది పరోక్షంలో దావా తీర్మానించెదరని తెలియచేయచున్నాము.

ఇట్లు
జి. మోహన వంశీ, న్యాయవాది
పాండురంగ నగర్, దానవాయిపేట,
రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా.
సెల్: **94414 85759**

రాజమండ్రి,
22-02-2024.